నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జనవరి 06, 2025 | www.navatelangana.com

భారీ వాహనాలకు రేడియం స్టిక్కర్స్ వేసిన ఆర్టీవో అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్లపై ఉన్న భారీ వాహనాలకు ఆర్టీవో అధికారులు రెడ్ రేడియం స్టిక్కర్లు అంటించారు. ఆదివారం జుక్కల్ నియోజకవర్గంలోని నేషనల్ హైవేపై ధర్మారం వద్ద భారీ వాహనాల వెనుక రెడ్ రేడియం స్టిక్కర్‌లు లేకపోవడంతో వాటికి అంటించారు. లారీలతో పాటు ఇతర వాహనాలు రేడియం స్టిక్కర్‌లను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, పోలీసుల తదితరులు పాల్గొన్నారు.



లారీకి వెనుకభాగంలో రెడ్ రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న ఆర్టీవో అధికారులు

వలకు చిక్కిన 15 కిలోల చేప

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మత్స్యకారుల వలకు భారీ చేప చిక్కింది. వేల్పూర్ మండల కేంద్రంలోని చెక్ డ్యామ్ వద్ద చేపలు పట్టేందుకు వల విసరగా.. 15 కిలోల భారీ చేప దొరికినట్టు బండి కిషన్ ఆదివారం తెలిపారు. గత 25 సంవత్సరాల నుండి చేపలు పడుతున్నట్లు, ఇంత పెద్ద చేప దొరకడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.



అడ్డుకుంటున్నా.. ఆగట్లే

- గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు
- పలుమార్లు చర్యలు తీసుకుంటున్నా.. మారని తీరు
- చట్టాల్లోని లొసుగులతో బయటకు వచ్చి మళ్లీ యథేచ్ఛగా పరీక్షలు, అబార్షన్‌లు
- బయటనుంచి ఆస్పత్రికి తాళం.. బయట ఇద్దరు సెక్యూరిటీ.. లోపల పరీక్షలు
- స్టింగ్ ఆపరేషన్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటేనే అడ్డుకట్ట

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి. బయట నుంచి తాళం వేసి ఉంటుంది. కానీ ఇద్దరు సెక్యూరిటీ గార్డులు బయట కాపలా కాస్తుంటారు. తాళం వేసి ఉన్నా.. పేషెంట్‌లు అక్కడికి వెళ్తుంటారు. ఉదయం వేళ 8 గంటల నుంచి లోపలికి వెళుతుంటారు. తీరా ఆరా తీస్తే గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు చర్యలు తీసుకున్నా.. చట్టాల్లోని లొసుగులను, పైరవీలు చేస్తూ మళ్లీ యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలతో పాటు, అబార్షన్ చేయిస్తుండటం గమనార్హం.

నవమాసాలు కడుపులో మోసి ప్రసవం తర్వాత పుట్టిన బిడ్డ ఆడ లేద మగ అని తెలుసుకోవాల్సిన గర్భిణీ స్త్రీలు నవ మాసాలు మోయకముందే లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకుని కడుపులోనే బిడ్డను వద్దనుకుంటే తీసేయడం కావాలనుకుంటే ఉంచుకోవడం వంటివి చేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని తెలిసినా కొందరి వైద్యుల కారణంగా గర్భిణీ స్త్రీలు లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకొని చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నారు. లింగ నిర్ధారణ చేస్తున్న ఆసుపత్రులపై జిల్లా ఆరోగ్య, పోలీస్ శాఖ అధికారులు ఎన్ని దాడులు చేసినా, స్కానింగ్ మిషన్లను సీజ్ చేసినా లింగ నిర్ధారణ పరీక్షలు మాత్రం ఆగడం లేదు. న్యాయశాఖలోని లా పాయింట్లను ఆసరా చేసుకుని బయటకు వస్తూ మళ్లీ చట్ట వ్యతిరేక పనులు కొనసాగిస్తున్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్నా ఓ ప్రైవేట్ ఆస్పత్రి పై దాడులు చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు నిర్ధారణ జరిగడంతో ఆసుపత్రిని సీజ్ చేసి ఎలాంటి అర్హత లేని స్కానింగ్ చేస్తున్న వైద్యుడిపై కేసులు నమోదు చేసి, స్కానింగ్ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఆసుపత్రిలో మరోసారి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు పదుల సంఖ్యలో ఉదయం, సాయంత్రం సమయాలలో ఇతర ప్రాంతాల నుండి గర్భిణీ స్త్రీలు బస్టాండ్ సమీపంలో ఉన్న ఆ ఆసుపత్రికి వెళ్లి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకుంటున్నట్లు సమాచారం. బయట నుండి ఆసుపత్రి సీజ్ చేసినట్టు కనిపించినా ఆసుపత్రి బయట ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకొని లోపల నుండి వైద్యం రాని సదరు వైద్యుడు స్కానింగ్ చేస్తున్నట్లు సమాచారం.






ఉదయం, రాత్రి సమయాలలో ఇతర రాష్ట్రాల నుండి వాహనాలు విచ్చలవిడిగా జిల్లా కేంద్రానికి రావడం ఆ ఆసుపత్రికి దూరంగా వాహనాలను నిలిపి ఆటోలలో గర్భిణీ స్త్రీలు స్కానింగ్ చేసే వైద్యుడు చెప్పిన సమయాలలో ఆసుపత్రికి వెళ్లి లిఫ్ట్ ద్వారా ఆసుపత్రి భవనం పైకి వెళ్లి స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకుంటూ బయటకు వస్తున్నారు. ఆసుపత్రి సీజ్ చేసినా గర్భిణీ స్త్రీలు ఎందుకు ఆ ఆసుపత్రి లోపలికి వెళ్తున్నారు? బయట నుండి సీజ్ చేసినట్లు కనిపించినా ఆ ఆసుపత్రి లోపల ఏం జరుగుతుంది.? బయట వ్యక్తులకు అనుమానం రాకుండా స్కానింగ్ చేసే వైద్యుడికి ఫోన్ చేసిన వారు మాత్రమే లోపలికి వెళుతున్నట్టు సమాచారం. ఆసుపత్రి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని బయట నుంచి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారు లోపల నుండి గమనిస్తూ లోపల లింగ నిర్ధారణ పరీక్షల తతంగాన్ని కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఎవరికి దొరకకుండా పరీక్షలు నిర్వహిస్తురని సమాచారం.

ఆ ఆసుపత్రిపై ఇప్పటికే జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు దాడులు చేసి ఆసుపత్రిని సీజ్ చేసి కేసులు నమోదు చేసి జైలుకు పంపినా.. బెయిల్ తీసుకొని బయటకు వచ్చి మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక అధికారులు, అటు పోలీసులు సతమతమవుతున్నారు. ఎన్నిసార్లు శాఖాపరమైన చర్యలు తీసుకున్నా బెయిల్‌పై బయటకు వస్తూ కుక్క తోక వంకరల వ్యవహరిస్తున్న ఆ ఆసుపత్రిపై వైద్యం రాని వైద్యుడు పై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఏ విధంగా లింగ నిర్ధారణ పరీక్షలకు ముగింపు పలకాలో తెలియక తీవ్ర ప్రయత్నాలు చేస్తూ విఫలమవుతున్నారు. ఆ ఆసుపత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపో వడంతో దీనిని ఆసరాగా చేసుకుని జిల్లా కేంద్రంలో ఉన్న ఇతర కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు సైతం గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు జిల్లా కేంద్రంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రజా సంక్షేమ సంఘం నాయకులు సైతం చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఆసుపత్రిని, వైద్యం రాని వైద్యుడిని శాశ్వత చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు వినతి పత్రం సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు ఆ ఆసుపత్రి పై, వైద్యం రాని వైద్యుడిపై పూర్తిస్థాయిలో స్టింగ్ ఆపరేషన్ ద్వారా పట్టుకొని లింగ నిర్ధారణ పరీక్షలకు శాశ్వత పరిష్కారం చూపుతారా..? తూతూ మంత్రంగానే తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటారా వేచి చూడాల్సి ఉంది.

అబార్షన్‌కో రేటు.. పీఎంపీలకు కమీషన్ షరామామూలే

లింగనిర్ధాణ పరీక్షల అనంతరం వారు కోరుకున్న సంతానం లేకపోవడంతో అక్కడే అబార్షన్‌లు సైతం చేస్తున్నట్టు సమాచారం. అబార్షన్ చేసేందుకు కెటగిరీల వారీగా వసూలు చేస్తున్నట్టు వినికిడి. మూడో నెల అయితే ఓ రేటు.. ఐదు, ఆరు నెలల మోసిన తర్వాత చేస్తే మరో రేటు తీసుకుంటున్నట్టు సమాచారం. కాగా ఇక్కడికి గర్భిణులను.. పలువురు పీఎంపీలు పంపుతున్నట్టు భోగట్టు. బిల్లులో వారికి సైతం కమీషన్ ముట్టజెపుతుండటంతో పేషెంట్‌లు వస్తున్నట్టు తెలిసింది.



నవోదయలో కీచకులు

- విద్యార్థినులపై లైంగిక వేధింపులు
- నలుగురి ఉపాధ్యాయులపై ఫోక్సో కేసు కింద రిమాండ్

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉన్నత భవిష్యత్తు కోసం తల్లిదండ్రులను విడిచి.. విద్యాలయంలోని ఉపాధ్యాయులను తల్లిదండ్రులుగా భావించి విద్యాబుద్ధులు నెర్చుకోడానికి వచ్చిన విద్యార్థినిలపై కీచకరూపంలో ఉన్న పలువురు ఉపాధ్యాయులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన నవోదయ విద్యాలయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. సదరు విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ కేసులు కాకుండా ప్రయత్నించినట్టు సమాచారం. కాగా కేసు నమోదు అయినా పోలీస్ స్టేషన్ నుంచి వివరాలు అందకపోవడం గమనార్హం. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయంలోని నలుగురు ఉపాధ్యాయులపై ఫోక్సో కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగుజూసింది.

వివరాల్లోకి వెళ్తే.. విద్యాలయంలో పలువురు ఉపాధ్యాయులు గత కొద్ది రోజులుగా విద్యార్థినులపై లైంగికవేధింపులకు పాల్పడినట్టు సమాచారం. గత డిసెంబర్ నెలలో పాఠశాలలో క్లాస్ అయిపోయాక లంచ్‌కు వెళ్లే క్రమంలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినికి క్లాస్ రూమ్ లోనే ఉంచేవాడని తోటి విద్యార్థులు ఆమెతో ఉండగా వారిని తిట్టి క్లాస్ రూమ్ నుండి వాళ్ళని పంపించి ఒక విద్యార్థినే క్లాస్ రూమ్ లో ఉంచి లైంగికంగా ఇబ్బంది పెట్టేవాడని సమాచారం. దీంతో పాటు ల్యాబ్ రూమ్‌లలో సైతం వేధింపులకు పాల్పడినట్టు సమాచారం. అయితే డిసెంబర్ నెల 22వ తేదీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగడంతో పూర్వ విద్యార్థులకు బాధిత విద్యార్థిని స్నేహితులు సమాచారాన్ని చెప్పడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని.. వేరే ప్రాంతానికి బదిలీ చేస్తూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఇదిలా ఉంటే అతన్ని కాపాడడానికి వైస్ ప్రిన్సిపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ఆలస్యం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. సెటిల్‌మెంట్ చేసే ప్రయత్నం చేసినట్టు వినికిడి. సదరు ఉపాధ్యాయుడిని అరెస్టు చేసిన నాలుగు రోజుల తర్వాత నవోదయ పాఠశాల చెందిన మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సైతం సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. విషయం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వైస్‌ప్రిన్సిపల్‌పై అనేక ఆరోపణలు

కాగా వైస్ ప్రిన్సిపాల్‌పై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విద్యాలయం గెస్ట్ హౌజ్‌లో ఓ మహిళను మూడు రోజుల పాటు ఉంచినట్టు సమాచారం. మిగతా ఉపాధ్యాయులు ఎవరని అడగగా ఆమె తన ఫ్రెండ్ అని సమాధానం చెప్పినట్టు వినికిడి. నవోదయ విద్యాలయంలోనికి, గెస్ట్ హౌజ్‌కు బయటి వ్యక్తుల ప్రవేశం నిషిద్ధం. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం గమనార్హం. మహిళా సిబ్బందిపై, మహిళా ఉపాధ్యాయులను సైతం ఇబ్బంది పెట్టినట్టు సమాచారం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, కీచక ఉపాధ్యాయులను విద్యాలయం నుంచి తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

లోన్‌యాప్‌లో వేధింపులతో యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-లింగంపేట్

లోన్‌యాప్‌లో వేధింపులతో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున వెలుగుజూసింది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన కమ్మరి గంగరాజు (29) వడ్రంగి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా ఇటీవల ఓ లోన్ యాప్ నుంచి సుమారు 52 వేల రుణం తీసుకున్నట్టు సమాచారం. కాగా లోన్ తీసుకున్నప్పటి నుంచి సదరు యాప్ నుంచి వేధింపులు ఎక్కువ అయ్యాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గంగరాజు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మృతుడు భార్య సోని తన కూతురు ఆధార్ కార్డు గురుంచి తన తల్లి గారింటికి శుక్రవారం వెళ్లగా, ఇంటివద్ద మృతుడు తన తల్లి అనసూయమ్మ ఉన్నారు. శనివారం అర్ధరాత్రి 2 గంటలకు లేచి చూడగా గంగరాజు కనబడక పోయేసరికి చుట్టు పక్కల వెతికిన ఆచూకీ దొరకపో వటంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా అయిలాపూర్ చెరువు కట్టపై చెప్పులు కనబడగా అనుమానంతో చెరువులో వెతకగా గంగరాజు మృతదేహ లభించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంచనామ నిర్వహించి ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈ నెల 25 నుంచి సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు

- సంగారెడ్డిలో తొలిరోజు బహిరంగ సభను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కే చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఇంటింటికి సీపీఐ(ఎం) పేరుతో ఈ 20 రోజుల పాటు పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్క ఇంటికి వెళ్లారని, ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరిపి వారి సమస్యల పరి ష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా తొలిరోజు 25వ తేదీన నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతిరామ్ నాయక్, కొత్త నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న సాగునీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా



ఉత్తర తెలంగాణ జిల్లాల వరాప్రదాయని ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుండి ప్రధాన కాలువల ద్వార యాసంగి పంటలకు వారబందీగా సాగునీరు ప్రాజెక్టు అధికారులు అందిస్తున్నారు. ప్రాజెక్టు 1088 అడుగులు 71 టిఎంసి ల నీటిమట్టం కలిగి ఉండగా కాకతీయ ప్రధాన కాలువ ద్వార 3833 , లక్ష్మి కాలువ ద్వార 200 , సరస్వతి కాలువ ద్వార 700 , అలిసాగర్ 463 , గుత్ప ఎత్తిపోతలకు 186 క్యూసెక్కుల సాగునీరు అందిస్తూ మిషన్ భగీరథ పథకం ద్వార ఆదిలాబాద్ , నిర్మల్ జిల్లాలకు 61 , కోరుట్ల మీదుగా జగిత్యాల జిల్లాకు 63 , ఆర్మూర్ మీదుగా నిజామాబాద్ , కామారెడ్డి జిల్లాలకు 107 క్యూసెక్కుల త్రాగునీరు సరఫరా చేస్తూ పూర్తిగా 231 క్యూసెక్కుల త్రాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు నుండి 425 క్యూసెక్కుల నీరు వథాగా ఆవిరి కావడంతో 11350 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుండి బయటికి వెళుతుంది అని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

ప్రజాప్రయోజనాలకే తొలిప్రాధాన్యత

- రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చెరుకు సాగుచేయాలి
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్



సొసైటీలో అదనపు గదుల నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టడానికి నిరంతరం కృషి చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రైతులు వరి పంటకు బదులు ప్రత్యామ్నయంగా చెరుకు పంట సాగుచేసిన లాభాలు పొందాలన్నారు. రైతులు చెరుకు పంట సాగుచేస్తే బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని పున్నప్రారంభించనున్నట్టు తెలిపారు. ఫ్యాక్టరీ ప్రారంభమయితే స్థానికులకు ఉపాధి లభిస్తుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. కావున రైతులు ప్రత్యామ్నాయ పంటగా చెరుకు సాగు చేయాలన్నారు. సాలూర మండలం సాలూర, సాలంపాడ్ క్యాంప్ గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సాలూరలో 13.5 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సొసైటీ కార్యాలయ గదుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. 5.00 లక్షల రూపాయల నిధులతో మరమ్మతులు చేసిన ఐడీసీఎంఎస్ గోదామ్‌ను ప్రారంభించారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన రైతుసేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సాలూర క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -4 ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీ పున:ప్రారంభం.. చెరుకు పంట సాగుపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శశిభూషణ్, ఏసిపి శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్లు గిర్దవార్ గంగారెడ్డి, శరత్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సీఈఓ బసంత్ రావు, ఐడిసిఎంఎస్ మేనేజర్ నగేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజు, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారచంద్, డైరెక్టర్ రాజా గౌడ్, నాయకులు అల్లె రమేష్, కన్నె సాయి రెడ్డి, సురేష్ పటేల్, మైదాపు నాగరాజు,రావుల లక్ష్మణ్,మంధర్న రవి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

సాలంపాడ్ క్యాంప్‌లో రైతుభవన్ ప్రారంభం

సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భవన్ సొసైటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. 45 లక్షల రూపాయలతో నిర్మించిన ఈ రైతు భవన్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు .ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బ్రహ్మ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పైపులు వేశారా.. అమ్మేశారా?

- ప్యాకేజ్ 21 పైపులు ఎక్కడ?
- ఒక్క పెద్దపైపు ధర రూ.8వేలు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

గ్రామాలకు సాగునీటి అందించడానికి చేపట్టిన సాగునీటి పథకాలు అక్రమార్కులకు వరంగా మారాయి. గత ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 21 ప్యాకేజీ కింద గ్రామాలకు సాగునీటిని అందివ్వడానికి కోట్ల రూపాయల నిధులతో వ్యవసాయ భూములకు నీరు అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనికి అనుకూలంగా కొన్ని గ్రామాలలో భూగర్భంలో పైపులను ఏర్పాటు చేశారు. మరికొన్నింటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ రైతులు వ్యతిరేకించడంతో పనులు ఆగిపోయాయి. భూగర్భంలో పెద్ద పైపులను ఏర్పాటు చేసి వాటి ద్వారా చిన్న పైపుల ద్వారా 20 ఎకరాలకు ఒక కంట్రోల్ వాల్ ద్వారా సాగునీరు అందించడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. నీళ్లు వస్తాయో రావని రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వీటితో పాటు పలు గ్రామాల్లో ఇంకా పైప్‌లైన్ నిర్మించాల్సిన అవసరం ఉంది. వీటికి సంబంధించిన పూర్తి స్థాయిలో పైపులను అప్పటి ప్రభుత్వ అధికారులు, నాయకులు ఇతర రాష్ట్రాల నుండి తెప్పించి నిల్వ ఉంచారు. రైతులు వ్యతిరేకించడంతో ప్యాకేజ్ 21 పనులను ఆపివేసిన అధికారులు వాటిని గ్రామాల్లోనే నిల్వ ఉంచారు. మోర్తాడ్ హైస్కూల్ గ్రౌండ్ లో భారీ స్థాయిలో పైపులను నిల్వ ఉంచారు.



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో భారీ స్థాయిలో చిన్న పైపులు, పెద్ద పైపులను గ్రామంలోని ఒక రైతు క్షేత్రంలో నిల్వ ఉంచగా ఆ రైతు వినతి మేరకు వాటిని లక్ష రూపాయలు ఖర్చుతో స్థానిక చెరువు పైభాగానికి నిలువ ఉంచారు. పనులు ప్రారంభమయ్యే వరకు ఇక్కడే నిల్వ ఉంచాలన్న ఉద్దేశంతో సుమారు 1000కి పైగా చిన్న పైపులు, 200లకు పైగా పెద్ద పైపులను అక్కడ అధికారులు కాంట్రాక్టర్ నిల్వ ఉంచారు. భూ సేకరణ చేపట్టే పనుల్లో నష్టపరిహారం తమకు వస్తుందో.. రాదు అని రైతులు చిన్న పైపులు ఏర్పాటు చేసే పనులను ఆపేయడంతో ప్యాకేజ్ 21 పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

పెద్ద పైప్‌లైన్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఆ లైన్ ద్వారా 20 ఎకరాలకు ఒక ఓపెన్ కంట్రోల్ వాల్ ఏర్పాటు చేయాల్సిన పనులు ప్రారంభించే సమయంలో రైతులు ఆసక్తి చూపకపోవడంతో వాటిని అప్పటి ప్రభుత్వం పనులు చేపట్టలేక పోయింది. ప్రస్తుతం తిమ్మాపూర్ చెరువువద్ద ఉన్న చిన్న పైపులు పెద్ద పైపులు అక్కడ కనుమరుగు అయ్యాయి. పనులు జరగనప్పుడు ఆ పైపులు ఎక్కడికి వెళ్లాయి అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సిన కాంట్రాక్టర్ వరంగల్ ప్రాంతంలో ఉండగా ఆ కాంట్రాక్టర్ సైతం ఆఫీసును ఎత్తివేసి అధికారులకు అందుబాటులో లేదని తెలిసింది. వ్యవసాయ క్షేత్రాల్లో రోడ్డుకు ఇరువైపులా పైపులను ఏర్పాటు చేసి నీటిని తరలించడానికి రైతులు ఆసక్తి చూపడంతో వాటిని ఆసరాగా చేసుకున్న జెసిబి వ్యాపారులు వాటిని తరలించి భారీగా డబ్బులను దండుకుంటున్నారు.

5 వేలకు అమ్మేస్తున్నారు

ప్రస్తుతం మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లో వ్యవసాయ రైతులకు అవసరాల నిమిత్తం వీటిని ఆసరాగా తీసుకున్న మొరం తరలింపు వ్యాపారులు 5వేల రూపాయలకు ఒక పెద్దపైపు అమ్ముకుంటున్నట్లు తెలిసింది. వందలాదిగా పైపులను తరలిస్తున్నా అటువైపుగా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారస్తులకు వరంగా మారింది. లక్షల రూపాయల వ్యయంతో పైపులను కొనుగోలు చేసిన వాటిని గాలికి వదిలేసి వేల రూపా యలకు విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఎవరు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారస్తులకు వరంగా మారింది.



పెద్దపైపు 8వేలు

అవసరాలకు అనుగుణంగా తీసుకున్న వ్యాపారస్తులు పెద్ద పైపు ఎనిమిది వేలు, చిన్న పైపు 5వేలకు విక్రయాలు జరిపి దగ్గరుండి రవాణా చేస్తున్నారు. మోర్తాడ్, పాలెం గ్రామాలకు చెందిన ఓ జెసిబి యజమానులు కుమ్మక్కుతో ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు సైతం పట్టించుకోకపో వడంతో వారి హస్తం కూడా ఉందా అని పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి.

మా దగ్గర ఎలాంటి సమాచారం లేదు

ఈఈ భానుప్రకాష్

ప్రస్తుతం ప్యాకేజ్ 21 పథకం సంబంధించి సమాచారం మా వద్ద లేదు. ఆ పనులు పూర్తిగా మెగా కంపెనీ వారికి చెందిన కాంట్రాక్టర్ వద్దే వివరాలు ఉంటాయి. వారు పనులు చేసిన అనంతరం బిల్లులు మంజూరు చేస్తామే తప్ప వాటికి సంబంధించిన పూర్తి వివరాలు మా వద్ద లేవు.

30వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం నాటికి 30వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వెంటనే చేయాలని కోరారు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావంగా నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ డీఎస్పీ మదరం గంగాధర్ సమ్మె శిబిరానికి హాజరై మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని అన్నారు. సమస్యల పరిష్కరించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గంగామణి, కోశాధికారి ప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శి బాబు, అధ్యక్షులు ప్రభాకర్, ఉద్యోగుల సంఘం నాయకులు రాణి, కవిత, సత్యనారాయణ, సామ్యూల్, గంగాధర్, రాజు, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవస్థానం

- రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవస్థానం ఉందని తాము పొందిన విజ్ఞానంను ముందు తరాలకు అందిస్తారని రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్టియు స్వాతంత్రంనకు ముందు ఏర్పడి ఈ రోజు ఉపాధ్యాయులు పొందుతున్న అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. ప్రభుత్వం విద్య వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, దానికి ఉపాధ్యాయులు కృషి చేసి పేద విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ (వాసు), జిల్లా కార్యవర్గ సభ్యులు బాల చంద్రం, యాదగిరి, పవన్ కుమార్, గంగకిషన్, సాయిబాబా, మల్లయ్య, హరికృష్ణ, సన ఉద్దీన్, పాల్గొన్నారు.

రైతు భరోసా రూ.15 వేలు చెల్లించాలి

- బీఆర్ఎస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన రైతు భరోసా పథకం హామీలో భాగంగా రైతులకు తక్షణమే 15 వేల రూపాయలను అందజేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం, మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలమీద గద్దెనెక్కిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రైతు భరోసా కింద 15 వేల రూపాయలు అందజేస్తామన్నారని తెలిపారు. ప్రస్తుతం రైతులకు 12 వేల రూపాయలను మాత్రమే ఇస్తాననడం విడ్డురంగా ఉందని అన్నారు. దేవుళ్ళపై ఒట్టేసి అబద్దాలు ఆడుతూ.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 15 వేల రూపాయలు పంట సహాయం కింద ఇవ్వకుంటే, ఏర్గట్ల మండల బీఆర్ఎస్ పార్టీ, రైతుల తరపున నిలబడి రైతు ఉద్యమాన్ని చేపడతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

యోగతోనే ఆరోగ్యం పొందొచ్చని యోగ సభ్యులు తెలిపారు. భీంగల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. యోగ సభ్యులు మాట్లాడుతూ మాట్లాడుతూ. ప్రతి రోజు యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, రకరకాల రోగాలకు యోగాతో పరిష్కారం పొందవచ్చని తెలిపారు. వెన్ను లేదా మెడ నొప్పి, నిద్ర సమస్యలు, తలనొప్పి, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఏకాగ్రత అసమర్థతతో సహా అనేక విధాలుగా ఒత్తిడి బహిర్గతమవు తుందని తెలిపారు. యోగలో భాగంగా ఆదివారం లింబాద్రి గుట్టపై గిరి ప్రదక్షణ చేశారు. అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 50 మంది పైగా యోగ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధి లోని పెర్కిట్ కోటార్మూర్‌లో గల విశాఖ నగర్‌లో శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఆలయ సలహాదారులు, విశాఖ నగర్ కుటుంబ సభ్యుల సమక్షంలో ఆదివారం నిర్వహించారు. ఈ కమిటీ 2025-26 వరకు ఆలయానికి సేవలు అందించనుంది. అధ్యక్షులుగా లోక దయాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లిక్కి గంగాధర్, కోశాధికారిగా కోమటి శెట్టి రాజలింగం, ఉపాధ్యక్షులుగా వాక హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శి, ప్రచార కార్యదర్శిగా జక్కుల మోహన్, సంయుక్త కార్యదర్శిగా రంగు నవీన్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో శంకర్, రాజేశ్వర్, లక్ష్మీ నరసయ్య, బెనికి నారాయణ, ఆలయ అర్చకులు గౌతమ్ పాండే, దీపక్ కుమార్, సతీష్‌రెడ్డి, బోజారెడ్డి సంజయ్ గౌడ్, రాజేందర్ గౌడ్, అశోక్, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాచార కమిషనర్లను నియమించాలి

- యుఎఫ్ఆర్‌టిఐ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



గత రెండేళ్లుగా తెలంగాణ సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్లు లేక అప్పీళ్ల ఫిర్యాదులు పెరుగుతున్నాయని యుఎఫ్ఆర్‌టిఐ రాష్ట్ర కో కన్వీనర్ అంకం నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహచట్టం పక్కగా అమలు కావాలంటే సమాచార కమిషనర్లను వెంటనే నియమించాలని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇంకా సమాచార కమిషనర్ల నియామకం చేపట్టడం లేదని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపుగా 1550 వరకు అప్పీళ్ల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2005లో సమాచార హక్కు చట్టంను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని పక్కాగా అమలుపరిచేందుకు ప్రయత్నం చేయాలని తెలిపారు.

నాలుగుశాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ
- నాలెడ్జ్ పార్క్ స్కూల్ యాజమాన్యం సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ

4శాతం ముస్లిం రిజర్వేషన్లను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఈ రిజర్వేషన్లను కాపాడుకోవడం తమ బాధ్యతని షబ్బీర్ అలీ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని నాలెడ్జ్ పార్క్ స్కూల్లో ఆదివారం జరిగిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. నాలెడ్జ్ పార్క్ స్కూల్లో చదువుకున్న 11 మంది విద్యార్థులకు 4శాతం రిజర్వేషన్ ద్వారా ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించారన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ముస్లింలకు ప్రస్తుతం కల్పిస్తున్న నాలుగుశాతం రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ రిజర్వేషన్లను రద్దు చేయలేరని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 4శాతం ముస్లిం రిజర్వేషన్ల కొనసాగింపుపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ల అమలుకు చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. నేటికీ కోర్టుల్లో పోరాడుతూనే ఉన్నానని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మైనారిటీ పాఠశాలలకు, నివాస భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. రిజర్వేషన్ వల్ల వేలాది మంది పేద ముస్లిం మైనారిటీ యువకులు ఇంజనీర్లు, డాక్టర్లుగా మారగలిగారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో నాలుగుశాతం ముస్లిం రిజర్వేషన్లు తీసుకురావడంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్యపాత్ర పోషించారని నాలెడ్జ్ పార్క్ స్కూల్ యాజమాన్యం షబ్బీర్ అలీని సన్మానించారు. మైనారిటీ సంక్షేమ మంత్రిగా మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1994 ఆగస్టు 25న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ప్రతిపాదిస్తూ మొదటి జీవో ఎంఎస్ నెంబర్ 30 షబ్బీర్ అలీ కృషితో జారీ చేసినట్లు యాజమాన్యం తెలిపారు.

గొర్రెపాటి మాధవరావు పోరాట స్ఫూర్తితో

ఇండ్ల పట్టాల కోసం ఉద్యమిద్దాం

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



గొర్రెపాటి మాధవ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

గొర్రెపాటి మాధవ రావు పోరాట స్ఫూర్తితో ఇండ్ల పట్టాల కోసం ఉద్యమిద్దామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా అన్నారు. మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు స్మారక సభను ద్వారక నగర్ గుడిసె వాసుల సంఘం (ఇఫ్టు అనుబంధం) ద్వారకానగర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు న్యూడెమోక్రసీ నగర నాయకులు నర్సింగ్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నీలం సాయిబాబ మాట్లాడుతూ.. గొర్రెపాటి మాధవరావు గొంతులేని పేద, బడుగు, బలహీనవర్గాలకు, తానే గొంతై వారి హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. నగరంలోని ద్వారక నగర్ గుడిసె వాసుల కోసం, శ్రామిక నగర్ గుడిసె వాసుల కోసం, పేదల ఇళ్ల స్థలాల కోసం కోర్టుల్లో పోరాడారని, వారికి ఇళ్ల స్థలాలు ఇతరత్రా సౌకర్యాలు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. భారత కార్మిక సంఘాల సమాఖ్యకు న్యాయ సలహాదారుడుగా ఉంటూ శ్రామికుల పక్షాన అనేక వేతన ఒప్పందాలకు మార్గదర్శకత్వం చేశారని, శ్రామికుల కేసులను కోర్టులో ఉచితంగా వాదించారని తెలిపారు. బీడీ కార్మికుల రక్షణ కోసం, వారి వేతన పెంపుదల కోసం యజమాన్యాలతో పూణే, ఔరంగాబాద్, మహారాష్ట్రలో స్వయంగా వేతన చర్చల్లో పాల్గొని బీడీ కార్మికుల పక్షాన నిలిచారని వారి కోసం కోర్టుల్లో ఉచితంగా వాదించారని చెప్పారు. న్యాయవాదిగానే కాకుండా ప్రజల పక్షపాతిగా ఉంటూ అనేక సామాజిక సమస్యలపై రచనలు చేశారని, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారని తెలియజేశారు. కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు మరణం పీడిత తాడిత ప్రజానీకానికి శ్రామిక వర్గానికి తీరనిలోటు అని వారి ఆశయ సాధనకు అంకితం అవ్వడమే వారికి ఇచ్చే నివాళి అని అన్నారు. ఈనెల 11న నగరంలోని ఎల్లమ్మ గుట్టలో జరిగే మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు శివ కుమార్, రమేష్, కుమార్, శాంతమ్మ, బాలమ్మ, చంద్రమ్మ, శేఖర్, పరశురాములు, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయండి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిడిఎస్‌యూ నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ మేనేజింగ్ ట్రస్టీ గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గొర్రెపాటి మాధవరావు చిత్రపటానికి పిడిఎస్‌యూ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ గొర్రెపాటి మాధవరావు పిడిఎస్‌యూకు అనేక సేవలందించారని, దేశంలో నూతన చట్టాలు ప్రభుత్వాలు తీసుకొచ్చినప్పుడల్లా చట్టాలలో ఉన్న సారాంశాన్ని క్లుప్తంగా విద్యార్థులకు వివరించేవాడని అన్నారు. పదునైన మాట బలమైన రచన రెండు గొర్రెపాటి మాధవరావు సొంతమని, తను చనిపోతూ కూడా మెడికల్ విద్యార్థుల ప్రయోగాల కోసం తన మృతదేహం ఉపయోగపడాలనుకోవడం తన ఆదర్శ జీవితానికి నిదర్శనమని అన్నారు, ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. సంస్మరణ సభను ఈనెల 11 న ఎల్లమ్మ గుట్టలో జంపాల ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నగర నాయకులు దేవిక, మనోజ్, నిఖిల్, సాయి కిరణ్, ముక్త శ్రీ, అలిష్, గంగప్రసాద్, ప్రదీప్, రాహుల్, బస్వరాజు తదితదిరులు పాల్గొన్నారు.

కుటుంబానికి కాదు.. కూలి చేసే ప్రతి కార్మికుడికి

ఇందిరమ్మ ఆత్మీయ భృతి ఇవ్వాలి

- ఏఐపికేఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు తుంగలో తొక్కుతుందని ఏఐపికేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ దుయ్యాబట్టారు. జనవరి 04 2024న మంత్రివర్గం తీర్మానాల్లో హామీలను విస్మరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి జీవన భృతి 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి గెలిచినా ఒక సంవత్సరానికి "చావు కబురు సల్లగా చెప్పినట్టు" కూలీ చేసే కార్మికుడికి కాకుండా భూమిలేని కుటుంబానికి ఇస్తామని ప్రకటించడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 60 లక్షల మంది కూలి పనిచేస్తుంటే వారందరికీ ఇవ్వకుండా 10-12 లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపు కోవాలని చూస్తోందని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ ప్రకటనతో రాష్ట్రంలో 60లక్షల మంది కూలీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రైతు భరోసా 15 వేలనుండి 12వేలకు కుదించడం అన్యాయం, మోసమని అన్నారు. అదే సమయంలో కౌలు రైతులకు ఇచ్చిన హామీని సైతం తుంగలో తొక్కారని అన్నారు. తక్షణమే రేవంత్ రెడ్డి రైతులకు క్షమాపణచెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా 15000 అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తానని ప్రకటించి ఇంకా 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయకుండా రేపు మాపంటూ కాలం గడుపుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ కాని వారందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని. రైతు కూలీలకు, మూడు ఎకరాల లోపు ఉన్న ప్రతి కార్మిడికి 12 వేల రూపాయలు అమలు చేయాలని అన్నారు. కౌలు రైతులకు రైతు భరోసాని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చెవిలో పువ్వుతో సివిల్ సప్లై హమాలీల నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని సివిల్ సప్లై అమలి కార్మికులు చేస్తున్నా సమ్మె ఆదివారానికి ఐదవ రోజుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆరెపల్లి సాయిలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పులను రేవంత్ రెడ్డి సర్కార్ చేయడం సరైంది కాదని అన్నారు. అరునెలల క్రితం సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా పెంచిన ముడు రూపాయలు పెంచాలని మాత్రమే అడుగుతుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజా పంపిణీ ద్వారా పంపిణీ చేయాల్సిన బియ్యం నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే హమాలీల డిమాండ్స్ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలానా. శ్రీకాంత్. నరేష్. దుర్గం రాజేందర్. మల్లయ్య. పేరోజ్. కిష్టయ్య. జెమునా. తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముత్యాల సునిల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. మండలంలోనినాగాపుర్ గ్రామానికి చెందిన జమున ఇటీవల గొర్లను కాసేందుకు వెళ్లి దురదృష్టవశాత్తు పాము కాటుకు గురై చనిపోయారు. విషయం తెలుసుకున్న సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.

బషీరాబాద్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సక్కారం అశోక్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కోనసముందర్ గ్రామానికి చెందిన బలేరావ్ సంతోష్ వాళ్ళ అమ్మ సాయమ్మ ఇటివల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మునుగంటి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కస్తూరి శ్రీనివాస్, కంపదండి అశోక్, శశిధర్, రాజేశ్వర్, కృష్ణుడు మల్లయ్య, శివానంద్, హరీష్, కిషన్, నాగార్జున్, శేఖర్ గౌడ్, భూమన్న అవినాష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన వినయ్-నివేదిత దంపతుల బిడ్డ రెండు నెలల పాప ప్రాణాపాయ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కుమార్ తక్షణమే స్పందించి ఆదివారం తనవంతు సాయంగా రూ.10వేల పంపారు. ఆ డబ్బులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముగ్గిడి ముత్యం రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. చిన్నారి కుటుంబ సభ్యులు ఈరవత్రి అనిల్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు..

షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలి

- బీఎల్‌టీయు
- 9న ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీడీ కార్మికులకు షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం-బీఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరాములు అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శివాజీ నగర్‌లోగల సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ తేదీని తొలగించి బీడీ కార్మికులకు, ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని ఈనెల ఈనె 9న ఛలో నిజామాబాద్ పాత కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికలలో బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2016 జీవన భృతి ఇస్తామని వాగ్దానం చేసి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు ప్యాకర్లు, బట్టి, చటన్, టేకేదార్లకు, 2014 ఫిబ్రవరి 28న కటాఫ్ తేదీని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇస్తామని చెప్పారని తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన బీడీ కార్మికులకు ఇచ్చిన మాట నేటికి అమలు చేయలేదన్నారు. ఇప్పటికే బీడీ కార్మికుల 2014 ఫిబ్రవరి 28 కటాఫ్ తేదీని తొలగించి ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలని ఈనెల 9న చేపట్టిన ఛలో నిజామాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాల్లోగల బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిఎల్‌టీయూ నిజామాబాద్ జిల్లా కన్వినర్ జగదిష్, జిల్లా కో కన్వీనర్ సయ్యద్, జిల్లా నాయకులు, గంగా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్‌లోని నాందేవ్ వాడలో గల రావుజి వంజరి సంఘం ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల 30 వసంతాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వారందరికీ భగవద్గీత గ్రంథాన్ని బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా 30 వసంతాల పూర్వజ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు.



అన్ని రకాల పంటలకూ బోనస్ చెల్లించాలి

- కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

అన్ని రకాల పంటలకు బోనస్ వర్తింపజేయాలని కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు పైడి విటల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతుకూ రుణమాఫీ అన్ని రకాల పంటలకు బీమా వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘం మండలాధ్యక్షులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు సన్మానం

- నూతన సంవత్సర విషెష్ తెలిపిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి జరిగే విధంగా కృషి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య, నాయకులు విక్రాంత్‌రెడ్డి, మధు, గోపాల్, రవిగౌడ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై
కఠిన చర్యలు తీసుకోండి

- ఏసీపీ, తహసీల్దార్‌లకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ-బోధన్/బోధన్‌టౌన్



తహసీల్దార్ శశిభూషణ్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మందర్న గ్రామం సమీపంలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా కట్టడి చేయాలని ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొని ఏసిపి శ్రీనివాస్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్‌లకు ఇసుక అక్రమ రవాణా కట్టడిపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, చట్టరీత్యా చర్యలు తీసుకుని వారిని కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి ద్వారా నిబంధనల మేరకు రుసుము చెల్లించిన వారికి మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కొంతమంది ఇష్టారీతినా ధరలు పెంచేసి ఇసుక రవాణా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు, ఇతర నిర్మాణాలకు ఇసుక అత్యవసరం కనుక సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా ధరలు ఉండాలని తెలిపారు. అంతేకానీ ఇష్టరీతినా ధరలు పెంచుతూ ఇసుక అమ్ముకుంటున్న వారిని ఎవరినీ వదలబోమని ఆయన హెచ్చరించారు.

101 ఫీట్ల జాతీయ జెండా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే..

బోధన్‌టౌన్ : బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 101 ఫీట్ల పొడవైన జాతీయ జెండాను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏకచక్ర సేవా సమితి మాట్లాడుతూ.. ఈ నెల రిపబ్లిక్ డే సందర్భంగా 26వ తేదీన జెండావిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ జెండా ఆవిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఏకచక్ర సేవాసమితి సభ్యులు కోరారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



క్రీడాకారులకు మినీ ట్యాంక్ బహూకరణ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని క్రీడాకారుల నీటి సౌకర్యం కోసం మినీ ట్యాంక్ బహుకరించినట్టు నేతాజీ యూత్ అధ్యక్షులు పంబల సతీష్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని కబడ్డీ వాలీబాల్ తదితర క్రీడాకారులు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండడం గమనించి స్థానిక ఉపాధ్యాయులు రామ గోనోల, రాజాగౌడ్ 15వేల విలువ గల మినీ ట్యాంక్ బహుకరించారని దీంతో క్రీడాకారుల నీటి సమస్య తీరుతుందన్నారు. ముమ్మందు మరిన్ని సహకారాలు యువతకు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి.చందు, ఎం.రాము, అస్లాం, క్రీడాకారులు తదితరులున్నారు.

నేషనల్ హైవే పనులతో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నేషనల్ హైవేకు సంబంధించి ట్రాన్స్‌కో పనులు ఆదివారం నిర్వహించగా 6 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు వినియోగదారులకు సమాచారం ఇవ్వకపోవడంతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏకంగా 6 గంటలపాటు అంతరాయం ఏర్పడడంతో వ్యాపారం స్తంభించిపోయింది.

త్రిలింగ రామేశ్వర ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర ఆలయ క్యాలెండర్‌ను ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, నాయకులు విక్రాంత్‌రెడ్డి, గోపాల్, ఆలయ ధర్మకర్త దత్తు ఉన్నారు.

గురుకుల ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు మంజూరు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.2.4 లక్షల నిధులు మంజూరైనట్టు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు ఆదివారం తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి పాఠశాలలో విద్యుత్ లోడ్ ఎక్కువ కావడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. విషయాన్ని ఎమ్మెల్యే మదనమోహన్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఎస్‌డిఎఫ్ నిధి నుంచి నిధులు మంజూరు చేశారని తెలిపారు. సంబంధిత ప్రొసీడింగ్‌ను జిల్లా స్థాయి అధికారులకు సోమవారం అందజేయనున్నట్టు తెలిపారు.

క్రికెట్ ఆడిన బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్



సాలూర మండల కేంద్రంలో సొసైటీ చైర్మెన్ అల్లే జనార్దన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సాలూర క్రికెట్ టోర్నమెంట్ సీజన్-4 పోటీలను ఆదివారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. యువకులు బౌలింగ్ చేయగా కార్యకర్తల ఉత్సాహం మేరకు ఎమ్మెల్యే బ్యాట్ పట్టి బంతిని బౌండరీ దాటించారు. ఆయన వెంట టోర్నమెంట్ నిర్వాహకులు అల్లె జనార్దన్, అల్లె రమేష్, సురేష్ పటేల్, రాహుల లక్ష్మణ్, క్రీడాకారులు ఉన్నారు.

సోయా పంట కొనుగోళ్లు 7 వరకు పొడిగింపు

- మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సర్క్యులర్ జారీ

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లాలో సోయా కొనుగోళ్లను ఈ నెల 7న పొడిగించినట్లు జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు 9 ఉన్నట్లు తెలిపారు. జనవరి ఒకటి 2025 నాటికి జిల్లాలో మొత్తం 8071 మంది రైతుల నుండి 1,37,871 క్వింటాళ్ల సోయా పంట కొనుగోలు చేసినట్టు వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సోయా పంటకు క్వింటాకు 4892 రూపాయలు మద్దతు ధర ప్రకటించినట్టు తెలిపారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-తాడ్వాయి

ఉపాధ్యాయ సెకండరీ గ్రేడ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి పుల్లూరు స్వామి తెలిపారు. బాన్సువాడ మండల అధ్యక్షులుగా హీరాలాల్, ఉపాధ్యక్షులుగా సంజయ్ రాథోడ్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, కన్వీనర్‌గా శ్రీకాంత్ ఎన్నికైనట్టు తెలిపారు.

తండా బూత్ కమిటీ ఎన్నిక


నియమక పత్రం అందజేత

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పెద్ద గుజ్జుల్ తండా భారతీయ జనతా పార్టీ బూత్ నెంబర్ 6 కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గిరిజన మోర్చా జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కాట్రోత్ రవి నాయక్ ఆదివారం తెలిపారు. బూత్ అధ్యక్షులుగా కాట్రోత్ పండరి నాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్ రామారావు, కార్యదర్శిగా బాధావత్ సుమన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గాంధారి మండల నాయకులు బాదావత్ రమేష్, సుమన్, లకావత్ సుమన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధి కోసం కృషి చేయాలి


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని శివరామ్ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షులుగా అంజయ్య, లక్ష్మి నారాయణ ఆలయ కమిటీ అధ్యక్షులుగా పుర్రా బాపురెడ్డి, కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ డైరెక్టర్‌లు నాయిని లింగారెడ్డి, చింతల చిరంజీవి, నాగారం నర్సింలు, చిన్నం స్వాతితో పాటు లక్ష్మి నారాయణ ఆలయ కమిటీ అధ్యక్షులు పూర్రా బాపురెడ్డి, డైరెక్టర్‌లు గాజులపల్లి శేఖర్ రెడ్డి, లింగ రాజేందర్, నగురం నర్సింలు, ఆరెపల్లి గాయిత్రిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి, అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి, సిద్ధరెడ్డి, పుల బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్రం పరీక్షలో
జిల్లా ద్వితీయస్థానం సాధించిన పిట్లం విద్యార్థి

నవతెలంగాణ-పిట్లం



శ్రీకాంత్‌కు మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న పలువురు

తెలంగాణ సాంఘిక శాస్త్ర జిల్లా ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షలలో మండల కేంద్రానికి చెందిన పదవ తరగతి విద్యార్థి శ్రీకాంత్‌రెడ్డి ద్వితీయ స్థానంతో మెమోంటో, మెరిట్ సర్టిఫికెట్ కైవసం చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రతిభ గుర్తించడానికి క్రీడలతో పాటు విద్యనభ్యసిస్తున్న సబ్జెక్టుల వారీగా వారి ప్రతిభను వెలికితీయాలనే సదుద్దేశ్యంతో జనవరి 4న జిల్లా కేంద్రంలోని ఆర్కె కళాశాలలో తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పాల్గొన్నారు. సాంఘిక శాస్త్రం పోటీ పరీక్షలకు గానూ 25 మండలాలకు చెందిన 65 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా.. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శ్రీకాంత్‌రెడ్డి రెండవ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో దీంతో సాంఘిక శాస్త్రం ఫోరం బాధ్యులు ఆయనను అభినందించి మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు ప్రసన్ కుమార్, బాల్‌రాజ్, రాజశేఖర్ రావు, కళాశాల సీఈఓ జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-వర్ని(చందూర్)


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మండల పరిధిలోని చందూర్ గ్రామంలోని జిల్లా ప్రభుత్వ పాఠశాల 1990-91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 34 ఏండ్ల తరువాత ఒక చోట కలుసుకున్నారు. తమ ఉద్యోగం, హెూదాను మరిచిపోయి చిన్నపిల్లల కేరింతలతో యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం కోలహలంగా మారిపోయింది. ఈ సమ్మేళనంలో గురువులను పుష్ప గుచ్చాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువులతో ఈనాడు ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. చదివిన బడి, పరిసరాలను చూసి ఆనంద పడ్డారు. గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు ఆటలు, పాటలు అలరించాయి. వచ్చిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పొద్దుపోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మదూరి, మాధవరెడ్డి, షేక్ జమాల్, శేషుగారి రఘుపతి, జగ్గారి శేఖర్‌రెడ్డి, రాజశేఖర్, పొతరెడ్డి, కండక్టర్ సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- ఏఎస్ఐ రాములు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


మాట్లాడుతున్న ఏఎస్ఐ రాములు

మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద ఆదివారం ఏఎస్ఐ రాములు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని తెలిపారు. రోడ్డు నిబంధనలపై ప్రతిఒక్కరికీ అవగాహన పెంపొందించడం కోసమే ప్రతి ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసు, రవాణా శాఖాధికారులు సంయుక్తంగా హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైవే యాక్సిడెంట్ మేనేజర్ సౌర ప్రతాప్, పోలీస్ సిబ్బంది సాయిశివ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి బడాపహాడ్ ఉర్సు

- హాజరుకానున్న పోచారం, వక్ఫ్‌బోర్డు అధికారులు

నవతెలంగాణ-వర్ని



మండలంలోని బడాపహాడ్‌లోని సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా ఉర్సు ఉత్సవాలు జనవరి 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దులహుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, వక్ఫ్‌బోర్డు ఇంచార్జి పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సావాలు జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని స్థానిక అధికారులకు తెలిపినట్టు పేర్కొన్నారు. భక్తుల నిమిత్తం అన్ని విధాలా వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాలకు స్థానిక వక్ఫ్‌బోర్డు అధికారులు సద్దాం హుస్సేన్, వక్ఫ్‌బోర్డు డిప్యూటీ జమాల్ చూస్తారని పేర్కొన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపొద్దు

- ఎస్ఐ శివకుమార్

నవతెలంగాణ-నిజాంసాగర్

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపవద్దని నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ ఆదివారం తెలిపారు. ప్రజల రవాణా సౌకర్యార్థం ప్రభుత్వం కోట్లు వెచ్చించి తారు రోడ్లను నిర్మిస్తుందని, ఆ రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడపడంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని ఆయన అన్నారు. మండలంలోని ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు పాటిస్తూ దమ్ము చక్రాలకు పట్టీలను బిగించి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అలానే దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే ఆ ట్రాక్టర్ యాజమానులపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

చైతన్య రథానికి 2లక్షల విరాళం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణజివాడి గ్రామ చైతన్య రథానికి వివిధ కుల సంఘాలు రూ.2లక్షల విరాళం అందజేసినట్టు బాలవికాస ప్లాంట్ సభ్యులు ఆదివారం తెలిపారు. వికాస ప్లాంట్ నుంచి లక్ష రూపాయలు అందజేయగా ముదిరాజ్ సంఘ సభ్యులు రూ.31వేలు, పద్మశాలి సంఘం రూ.15వేలు, రెడ్డి సంఘం రూ.51వేలు, నాయి బ్రాహ్మణ సంఘం రూ.3వేలు, శాలివాహన సంఘం రూ.2వేలు విరాళంగా బాలవికాస ప్లాంట్ సభ్యులకు గ్రామ సంఘాల సభ్యులు అందజేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో పాబ్బ శేఖర్, గోల్డెన్ జిమ్ ఆధ్వర్యంలో సంజీవిని హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానిన సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను పాఠశాలలో చేరేందుకు నేటి నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు గాను రూ.125, ఇతరులకు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 3న హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకార సంఘం సలహా కమిటీ సమావేశం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని సహకార సంఘం సలహా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జీఎస్టి, ఆదాయపు పన్ను, తదితర చెల్లింపులపై చర్చించారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రియాజ్ ఉద్దీన్, వెంకటేశ్వర్ రావు, ఇంచార్జి సెక్రటరీ శివాజీ, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గణేష్ నాయక్


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సునావత్ గణేష్ నాయక్ ఎన్నికైనందుకు తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గణేష్ నాయక్ డైరెక్టర్‌గా ఎన్నికైనందుకు డాక్టర్ తేజావత్ బెల్లయ్య సన్మానించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా వైస్ చైర్మన్ నరేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
సోమవారం | జనవరి 06, 2025 | www.navatelangana.com

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని దాస్ నగర్ లో గల మహాత్మా గాంధీ జ్యోతిభాపులే సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (సీఈసి) చదువుతున్న టీ. సంజన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ యం. స్వప్న ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో జిల్లా తరపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ నెల 6 నుండి 10 వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ యం. స్వప్న, ఫిజికల్ డైరెక్టర్ నీరజ, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-మోర్తాడ్



మండలంలోని సుంకెట్ గ్రామానికి చెందిన మత్స్యకార సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం కాంగ్రెస్‌పార్టీలో చేరినట్టు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు చెప్పారు. సునీల్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ అభివృద్ధికి తాము కృషి చేస్తామని అన్నారు. గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘ సభ్యులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రైతులకు సంఘీభావంగా నేడు నిరసనలు

- రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పుకుంటూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా కపటనీతిని ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ నిరసన కార్యక్రమాల ద్వారా నిలదీస్తామని, రైతులకు చేస్తున్న మోసాలను ఎండగడతామని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన రైతాంగానికి సంఘీభావంగా సోమవారం చేపట్టే నిరసన కార్యక్రమాలలో నిజామాబాద్ జిల్లా రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జీవన్ రెడ్డి పిలుపు నిచ్చారు.

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ట్రైలర్ లాంచ్‌కు ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

సంక్రాంతికి వస్తున్నాం సినిమా ట్రైలర్ లాంచ్‌కు నగరంలోని కలెక్టరేట్ మైదానాన్ని ఆదివారం నిర్వాహకులు పరిశీలించారు. దిల్ రాజు ప్రెజెంట్స్, విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంక్రాంతికి వస్తున్నాం ట్రైలర్ జనవరి 6న నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్ లో గ్రాండ్‌గా లాంచ్ ఉందని నిర్వాహకులు నాగేశ్వరరావు, నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

ముగిసిన లిల్లీపుట్ పాఠశాల విద్యార్థుల విహారయాత్ర



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలోని విద్యార్థుల విహారయాత్ర విజయవంతంగా జరిగినట్టు పాఠశాల కరస్పాండెంట్ రాజుల దేవి రామకృష్ణ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్మల్‌లోని అర్బన్ పార్క్‌ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ ఆట పాటలతో సందడి చేశారు. ప్రముఖమైన దేవాలయాన్ని సందర్శించినట్టు పేర్కొన్నారు. ఇలా విహారయాత్రకు తీసుకుపోవడం వల్ల విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని, చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్ప స్వాముల నిత్యాన్నదాన బిక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమన్ ప్రాంగణంలో గల అయ్యప్ప సేవ సమితి అయ్యప్ప నిత్య అన్నప్రసాద భిక్ష వితరణలో భాగంగా నవంబర్ 25 నుంచి జనవరి 5 వరకు కొనసాగి ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని గురుస్వామి శర్మ ఆధ్వర్యంలో కొనసాగడం జరిగింది. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు పెంట జలంధర్, అధ్యక్షులు జనార్ధన్‌గౌడ్, కోశాధికారి ధనుంజయ్, మీసాల రాజేశ్వర్, గురు స్వాములు చంద్రశేఖర్, యోగి గంగాధర్ గౌడ్ గురు స్వాములు పాల్గొన్నారు.

నరహరి అందరికీ ఆదర్శప్రాయం

- రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఉన్నత మైన హోదాలో ఉద్యోగ విరమణ పొంది పట్టణంలో మంచి జీవనం కొనసాగించే అవకాశం ఉన్న, కని పెంచిన తల్లి తండ్రులను చూసుకోవాలని ఇక్కడ మానాల గ్రామంలోనే మిగతా జీవితాన్ని గడపడానికి మాలోత్ నరహరి నిర్ణయం అందరికి ఆదర్శప్రాయం అని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ నియోజకవర్గం లోని రాజన్న సిరిసిల్ల జిల్లా మానాల గ్రామంలో జరిగిన మాలోత్ నరహరి నాయక్ (డిప్యూటీ డైరెక్టర్,టౌన్ ప్లానింగ్) ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, సహకార కార్పొరేషన్ చైర్మన్ మానాల మొహన్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నరహరి నిబద్ధతతో కూడిన వ్యక్తి అని అన్నారు. ఒక ఉద్యోగిగా తన బాధ్యతను నిర్వర్తించి అలాగే ఒక తండ్రిగా కుటుంబాన్ని నడిపి, గతంలో ఉద్యోగానికంటే ముందు రాజకీయ నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలకు నరహరి సేవ చేశారన్నారు. ఇకముందు కూడా ఆయురారోగ్యాలతో ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కొనసాగుతున్న హమాలీల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఎంఎల్ ఎస్ పాయింట్ వద్ద హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా హమాలీలు చెవిలో పూలు పెట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఓమయ్య మాట్లాడుతూ హమాలీలకు పెరిగిన కూలీ రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియర్స్ తో కలిపి డబ్బులు చెల్లించాలని, స్వీపర్లకు రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు మోహన్, గౌస్, దిలీప్, జాకీర్, బాలాజీ, నాగనాథ్, మనోహర్, లక్ష్మణ్, సంజు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ
- మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా పెట్టాల్సిందే
- జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిగ్రీ దేశంలో భాగంగానే రాష్ట్రంలో సమగ్ర కుల సర్వే నిర్వహించి నిర్వహించామని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కులగణనను ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. నేడు నిజమబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతిరెడ్డి, నగర మేయర్ నీతు కిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షునిగా బీసీకి అవకాశం కాంగ్రెస్ పార్టీ కల్పించిందని, అలాగే రాష్ట్రంలో కులగణను నిర్వహించడంతోపాటు కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్‌ఛార్జీలు ఒకేసారి 40 శాతం పెంచామని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాదుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి రోజైన జనవరి 3ను రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ఉమెన్స్ టీచర్స్‌డేగా జరపాలని అనేక సంవత్సరాలుగా తాము చేస్తున్న పోరాటానికి స్పందించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9 విడుదల చేయడం స్వాగతిస్తున్నామని, జయంతి వర్ధంతిలను కూడా అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని అన్నారు. సావిత్రి భాయి మాత్మ పూలే దంపతుల విగ్రహాలను రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని ఒక యూనివర్సిటీకి సావిత్రిబాయి పూలే యూనివర్సిటీగా నామకరణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు తీసుకువచ్చి బీసీ మహిళలకు అన్యాయం చేసిందని, మహిళా బిల్లులలో బీసీ మహిళలకు సబ్ కోట లేకుండా మహిళా బిల్లు తీసుకురావాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాలని, బీసీల శకం రాష్ట్రంలో ప్రారంభమైందని వచ్చేది బీసీల రాజ్యమేనని జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి మాట్లాడుతూ కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు రాష్ట్ర ప్రభుత్వం పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, సావిత్రిబాయి పూలే జయంతి రోజును ఉమెన్స్ టీచర్ చేయగా ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారాలు అందిస్తామని తెలిపారు. నిజామాబాద్ నగర మేయర్ నీతు కిరణ్ మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

పూలేను ఆదర్శంగా తీసుకుని వివిధ రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలు సామాజిక సాంఘిక అసమానతలపై పోరాడి సమానత్వం సాధించడానికి కృషి చేయాలని ఆమె కోరారు నేటి మహిళలకు సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా బీసీ మహిళ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 120 మంది మహిళలకు సావిత్రిబాయి పూలే అవార్డులు ప్రకటించి సన్మానించారు. బీసీ ఉపాధ్యాయ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, బిసిటియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యానిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, బిసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు ఎ.మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, బిసిటియు నాయకులు పాల్గొన్నారు.

మానాల, మరిమడ్ల రోడ్డు పనులు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి మానాల మరిమడ్ల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానాల, మరిమడ్ల రోడ్డు ఏర్పాటు ఇక్కడి ప్రాంత ప్రజల చిరకాల కోరికఅని ఎమ్మెల్యే అన్నారు. ఈ మానాల ప్రాంత ప్రజల బంధుత్వాలు ఎక్కువగా మరిమడ్ల వైపు ఉండటంతో ఎప్పుడు మానాల వచ్చిన ఈ రోడ్డు మంజూరు చేయమని ప్రజలు నన్ను అడిగేవారని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి నిధులు, ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకొచ్చి పనులు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో సంవత్సర కాలంగా పనులు కొనసాగడం లేదన్నారు. తొందరగా రోడ్డు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల

పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆత్మీయ కుటుంబాలకు పరామర్శ....

మానాల గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పలువురు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించారు. అడ్డబోర్ తండాకు చెందిన ఆత్మీయులు లావుడియా నారాయణ భార్య కాలం చేయడంతో వారిని, బడితండా కు చెందిన గుగులోత్ రవి తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.సర్పంచ్ తండాకు చెందిన ఆత్మీయులు చిన్న తండ్రి గుగులోత్ రామ్ సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.

కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు రాజారామ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తిరుపతి నాయక్, నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగ అన్నందుకు అత్తను చంపిన అల్లుడు

- 48 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తనను తరచుగా దొంగని అవమానించినందుకు అల్లుడు తన అత్తను చంపేశాడు. నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్‌లో జరిగిన వృద్ధురాలి హత్య కేసును 48 గంటల్లో ఛేదించారు. సౌత్ రూరల్ సర్కిల్ సీఐ సురేష్ తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సారంగాపూర్ కు చెందిన దుబ్బాక సాయమ్మ (62) ఈ నెల 3న తన ఇంట్లో హత్యకు గురయ్యారు. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. సాయమ్మ రెండవ కూతురి భర్త లక్ష్మణ్ గతంలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆయనపై 30కి పైగా కేసులు నిజామాబాద్, కామారెడ్డిలో నమోదైనట్లు వెల్లడించారు. మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారించగా తరచుగా తనను దొంగ అంటూ అత్త అవమానించిందని, దీనిని భరించలేక హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు సిఐ వెల్లడించారు. మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి సారంగాపూర్‌లో లక్ష్మన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆయన వద్దనుండి మృతురాలికి సంబంధించిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. హత్య కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు. హత్య కేసును 48 గంటల్లో ఛేదించిన ఆరవ టౌన్ ఎస్ఐ వెంకట్రావు, మోపాల్ ఎస్సై యాదగిరి ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

హైవేలపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయొద్దు

- నేషనల్ హైవే సూపర్వైజర్ నారాయణ
- రోడ్ సేఫ్టీపై అవగాహన

నవతెలంగాణ-మెండోర

నేషనల్ హైవే మీద ప్రయాణం చేసే వాహనదారులు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకూడదని నేషనల్ హైవే సూపర్వైజర్ నారాయణ తెలిపారు. మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. నేషనల్ హైవే రోడ్ సేఫ్టీ హైవేల ఆపరేషన్, నిర్వహణ, భద్రతను మెరుగుపరిచే ప్రయత్నంలో, ప్రత్యేక కారిడార్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను మండల కేంద్రంలోని జీపీలో ఏర్పాటు చేశారన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల రేటు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు , అధికారులు ఆందోళనలకు గురవుతున్నారని అన్నారు.. హైవే భద్రత , ప్రమాదాల మూలకారణ విశ్లేషణ, ఉపశమన చర్యలు, హైవేలపై ఆక్రమణల నివారణ, ప్రమాదాల ఘటనలపై అవగాహన కల్పించారు. కార్ర్యమంలో నేషనల్ హైవే సుపర్ వైజర్ నారాయణ , వెంకట్ రావు , నేషనల్ హైవే సిబ్బంది , హెడ్ కానిస్టేబల్ ప్రభాకర్ గౌడ్ , బీంరావ్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌హెచ్ సూపర్వైజర్

ఈరవత్రి అనిల్‌కు టీజీఎండీసీ చైర్మన్ పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఈరవత్రి అనిల్ మామ కోరుట్ల పట్టణానికి చెందిన వాసం భూమానందం కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ముత్యాల సునీల్ కుమార్ కోరుట్ల పట్టణంలో ఈరవత్రి అనిల్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వాసం భూమానందం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, నాయకులు వేముల గంగారెడ్డి, మోహన్ నాయక్, అజారుద్దీన్, కాంగ్రెస్ పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ చేతుల మీదుగా అందజేశారు. సుమారు పదిమంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో నూడ చైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, జావిద్ అక్రమ్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా చరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

రైతు భరోసా దేశ చరిత్రలోనే ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదివారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపైన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సంవత్సరానికి 12వేలు రైతు భరోసా అమలు చేస్తున్నామని, ఇది దేశ చరిత్రలోనే ఒక చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. గత ప్రభుత్వం గుట్టలు, రాళ్లు ఉన్న ప్రదేశం, రియల్ ఎస్టేట్ భూములు, నాలా కన్వర్షన్ ఉన్న భూములకు కూడా రైతుబంధు అందించి 20వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఏడు లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణ రాష్ట్రానికి అంధకారంలో నెట్టిన దౌర్భాగ్య ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు వందల యూనిట్ల ఉచిత కరెంటు అలాగే రైతులకు 500 రూపాయల బోనస్, రూ. 500కే సిలిండర్, రుణమాఫీ కూడా చేశామని తెలిపారు. అతి త్వరలో మిగతా వారికి రుణమాఫీ చేస్తామని ఆయన అన్నారు. ప్రతి ప్రభుత్వ స్కూల్‌కి మరమ్మత్తులు చేయించామని, ప్రతి మండలానికి ఒక ఎంఈఓ, యూనివర్సిటీ ఒక వైస్ ఛాన్స్‌లను కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉద్యోగ క్యాలెండర్ ద్వారా అవినీతికి తావు లేకుండా భర్తీలను చేస్తుందని అన్నారు. దాదాపు 70 నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఏ పంట వేసినా కూడా రైతు భరోసా పథకం వర్తిస్తుందని, హార్టికల్చర్ అయినా సరే ఆరుతడి పంటలకైనా రూ.12వేలు అందిస్తుందని అన్నారు. భూమిలేని నిరుపేదలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా సంవత్సరానికి 12వేలు రూపాయలు వారికి కూడా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

అందిస్తుందని తెలిపారు. బీజెపి పాలిత ప్రాంతాల్లో అయితే ఒక రుణమాఫీలేదు.. రైతు భరోసా లేదు అటువంటివారు కాంగ్రెస్ పైన విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రకృతి వైపరిత్యంతో మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం లాంటి జిల్లాల్లో పదివేల కోట్ల వరకు నష్టం జరిగి సెంట్రల్ గవర్నమెంట్ వారే సర్వే చేసి ఇస్తే కేవలం 400 కోట్ల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఇక్కడ 8 మంది బిజెపి ఎంపీలు ఉండి కూడా సెంట్రల్ నుండి నిధులు తీసుకొచ్చే పరిస్థితిలో వారు లేరని తెలిపారు. ఇక్కడున్న ఎంపీ కూడా పసుపు బోర్డు ఇదిగో అదిగో అని చెప్తూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి కూడా పసుపు బోర్డుని ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చి తప్పారని ఇటువంటి వారికి ప్రజలే రానున్న రోజుల్లో బుద్ధి చెప్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ బిల్లుని అమలు చేయకుండా తెలంగాణకు ప్రతి క్షణం మోసం చేస్తున్నారని, మనకు రావాల్సిన సెంట్రల్ నిధులలో కోత విధిస్తున్నారని, సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కవిత కూడా మొన్న జిల్లాకు వచ్చి హంగామా సృష్టించించారని, ఆమె వచ్చింది ఉద్యమం నుంచి కాదని, జైలు నుంచి అని ఒక అన్నారు. ఒక ఆడపడుచు లిక్కర్స్ స్కామ్‌లో దొరికి నిజామాబాద్ పరువు తీశారని, ఇంకా అటువంటి ఆమె ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఆమె తండ్రేమో ఫామ్ హౌస్ లో కూర్చొని కాంగ్రెస్ సర్కార్ని పడగొట్టాలని ప్రయత్నంలో ఉన్నాడని, పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకున్న డబ్బులతో జల్సా చేస్తున్నారని మండిపడ్డారు, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, పార్టీలకతీతంగా దారిద్రరేఖ దిగువనున్న వారికి మొదటగా ప్రాముఖ్యత ఇస్తూ విడతల వారీగా ఇస్తామన్నారు. దేశ చరిత్రలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద కుంభకోణాలలో ఒకటని, ఈ ప్రాజెక్టు వల్ల లక్ష కోట్ల అవినీతి జరిగిందని, గొర్రెల స్కామ్, దళిత బంధుస్కామ్ జరిగిందని, దళితులకు ఇచ్చే మూడు ఎకరాల్లో కూడా ఇవ్వకుండా దళితులను మోసం చేశారని ఆయన తెలిపారు. కేటీఆర్ ఫార్ములా ఈ రేసింగ్‌లో అవినీతికి పాల్పడి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని, అవినీతి పాల్పడకపోతే కోర్టు నుండి స్టే తెచ్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. అతి త్వరలో కేసీఆర్ కుటుంబం మొత్తం జైలు పాలవుతుందని, అలాగే వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే బీసీల కొరకు 32 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీఆర్ఎస్ పార్టీకి దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ లాగా ఒక బీసీ నాయకుడిని పార్టీ ప్రెసిడెంట్ చేయాలని ఆయన సవాల్ విసిరారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 100శాతం క్లీన్‌స్వీప్ చేస్తామని అన్నారు. సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, టిపిసి సెటిల్ గేట్ శేఖర్ గౌడ్, భోజన్న, బాగా రెడ్డి, పసుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

మానవత్వం చాటుకున్న దంపతులు


ఫోన్‌ను అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో పోగొట్టుకున్న వ్యక్తి ఫోన్‌ను తిరిగి అప్పగించి దంపతులు మానవత్వం చాటుకున్నారు. గ్రామానికి చెందిన రామవ్వ మల్లేష్ దంపతులు భిక్కనూరు పట్టణానికి వెళ్తుండగా మార్గమధ్యలో మొబైల్ ఫోన్ దొరికింది. పోగొట్టుకున్న వ్యక్తి ఫోన్ చేయగా రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి తిరిగి అప్పగించారు. మొబైల్ ఫోన్ దొరకగానే స్విచ్ ఆఫ్ చేసే ఈ రోజుల్లో తిరిగి అప్పగించి మానవత్వం చాటుకున్న దంపతులను గ్రామస్తులు, పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

మహావృక్షం నేలకొరిగింది


పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూల్చివేసిన చెట్టు

నవతెలంగాణ-తాడ్వాయి

పోలీస్ స్టేషన్లో ఓ మహా వృక్షాన్ని అధికారులే నేల కూల్చారు. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మద్యం సేవించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న చెట్టు పైకి వెళ్లి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. దీంతో అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దనే ఉద్దేశంతో పచ్చని చెట్టుపై గొడ్డలి వేటు వేశారు. గత రెండు దశాబ్దాలుగా ఏపుగా పెరిగిన వృక్షం.. రెండు గంటల్లో నేలమట్టం కావడంతో స్థానికుల్లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

నిలిచిన రేషన్ సరఫరా

పీడీఎస్ గోదాముల నుంచి చౌక ధరల దుకాణాలకు బియ్యం బస్తాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేసే సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు సమ్మెకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. అందులో భాగంగా వారి సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. కాగా హమాలీ కార్మికులు సమ్మెలో ఉండడంతో రేషన్ దుకాణాలకు చేరవలసిన బియ్యం ఇప్పటివరకు చేరలేదు. దీంతో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పొందుతున్న నిరుపేద ప్రజలు బియ్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ప్రజలకు బియ్యం అందేలా చూడాలని సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు కోరుతున్నారు.

- 5వ రోజుకు చేరిన సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె
- డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్న హమాలీలు
- రేషన్ దుకాణానికి వెళ్లి.. వెనుదిరుగుతున్న ప్రజలు

నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏడు పీడీఎస్ గోదాములుండగా అందులో 72 మంది హమాలీలు పనిచేస్తున్నారు. కామారెడ్డిలో 16 మంది, దోమకొండలో 12, సదాశివనగర్‌లో 10, ఎల్లారెడ్డిలో 9, బాన్సువాడలో 9, పిట్లంలో 8, బిచ్కుందలో 10 మంది గోదాములలో హమాలీలుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు ఆయా గోదాముల్లో స్వీపర్లుగా ఏడుగురు పనిచేస్తున్నారు. ఈ గోదాములన్నీ ఇప్పటివరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. ఇక నిజామాబాద్ జిల్లాలో బోధన్, వర్ని, డిచ్‌పల్లి, ఆర్మూర్, మోర్తాడ్, భీంగల్, నిజామాబాద్, నవీపేట్ మండలాల్లో కార్మికులు సమ్మె చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 97 మంది హమాలీ, స్వీపర్ కార్మికులు సమ్మెలో ఉన్నారు.


బోధన్‌లో సమ్మెలో పాల్గొన్న హమాలీలు

కూలి పెంపు కోసం పోరు..

గత కొన్ని సంవత్సరాల నుంచి వీరికి ప్రభుత్వం క్వింటాకు రూ.26 చెల్లిస్తుంది. అయితే రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో వారికి ఇల్లు గడవడం కష్టంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా.. వారి కూలి మాత్రం పెరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు తమ కూలిరేట్లను పెంచాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్న ఇప్పటివరకు వారి మొర ఆలకించిన ప్రభుత్వాలు లేవు. తమకు ఈఎస్ఎస్ సౌకర్యం కల్పించాలని, రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతిచెందితే పది లక్షలు ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

జీవో విడుదల చేయలే..

మూడు సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ హయాంలో అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి హరీష్ రావు రూ.29 క్వింటాలకు చెల్లిస్తామని అగ్రిమెంట్ చేశారు. జీవో మాత్రం ఆ ప్రభుత్వం ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సివిల్ సప్లై హమాలీలు సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అక్టోబర్ నెలలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన సివిల్ సప్లై కమిషనర్ చవాన్‌ను నుండి వివరాల సేకరించడంతో గత ప్రభుత్వం అగ్రిమెంట్ చేసిందని, కానీ అమలు చేయలేదని చెప్పడంతో ఇది అమలుకు యోగ్యమైనదేనని గత సంవత్సరం అక్టోబర్ నెలలో 10న అమలు చేస్తామని చెప్పినా.. ఇప్పటివరకు క్వింటాలుకు మూడు రూపాయలు ఇచ్చేందుకు జీవో జారీ చేయలేదు. దీంతో సివిల్ సప్లై హమాలీలు జనవరి 1 నుంచి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. సమ్మెను ప్రారంభించారు.

దుకాణాలకు చేరని రేషన్ బియ్యం..

హమాలీ కార్మికులు సమ్మెలో ఉండడంతో రేషన్ దుకాణాలకు చేరవలసిన బియ్యం ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. దాంతో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పొందుతున్న నిరుపేద ప్రజలు బియ్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయవలసి ఉంటుంది. కానీ ఐదవ తేదీ వరకు అయినా బియ్యం దుకాణాలకు రాకపోవడంతో ప్రజలు సమ్మె విషయం తెలవక దుకాణాలకు వెళ్లి ఆరా తీసి వెనుదిరుగుతున్నారు. నిరుపేదలు బయట బియ్యం కొనలేక పస్తులు ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. అయినా కూడా అధికారులు, ప్రభుత్వం హమాలీ కార్మికులతో చర్చలు జరుపకుండా అలసత్వం వహించడంతో సమస్య జటిలంగా మారింది. కావున ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం సైతం రేషన్ బియ్యం పంపిణీ చేయవలసి ఉండగా అక్కడ కూడా బియ్యం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం మానుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన వేతనాలు చెల్లించాలి



సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు, స్వీపర్లకు పెరిగిన వేతనాలు ప్రకారం తక్షణమే అమలు చేయాలి. లేనియెడల సమ్మె కొనసాగిస్తామన్నారు.

- పవన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి

ఒప్పందం ప్రకారం జీవో విడుదల చేయాలి



గత సంవత్సరం కార్మికులకు పెంచుతామన్న వేతనాల ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలి. అలాగే జీవోను విడుదల చేయాలి. కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిగి సంవత్సరం గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు జీవో విడుదల చేయకుండా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదు. జీవో విడుదల చేసే వరకూ సమ్మె కొనసాగిస్తాం.

- వెంకటేష్ హమాలీ కార్మికుడు

ఈఎస్ఐ, పింఛన్ సౌకర్యం లేదు



కొన్ని సంవత్సరాల నుంచి సివిల్ సప్లైలో బియ్యం పంపిణీ చేస్తున్నా.. ఇప్పటివరకు మాకు సరైన సౌకర్యాలు లేవు. అధికారులకు, రాజకీయ నాయకులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఫలితం లేదు. ఈఎస్ఐ, పింఛన్, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి. నిత్యావసర ధరలకు అనుగుణంగా మా కూలిలను ఎప్పటికప్పుడు పెంచుతూ ఉండాలి.

- కార్మికుడు శ్రీనివాస్. కామారెడ్డి

ప్రభుత్వం నుంచి స్పందన లేదు



గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వం మా కష్టాన్ని దోచుకుంటుంది. సివిల్ సప్లై గోదాముల నుంచి చౌక ధరల దుకాణాలకు రవాణా చేస్తున్న బియ్యానికి క్వింటాకు రూ.26 ఇస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మూడు రూపాయలు పెంచాలని మూడు సంవత్సరాలుగా కొట్లాడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మాకు ఎలాంటి బెనిఫిట్స్ సైతం లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- సివిల్ సప్లై హమాలీ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బీరయ్య

ప్రమాదకరంగా సిమెంట్ రోడ్డు

- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి


ప్రమాదకరంగా మారిన గుంత

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని పెద్ద హనుమాన్ వెళ్లే ప్రధాన డ్రాఫ్ సిమెంట్ రోడ్డుపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక గ్రామస్తులు తెలిపారు. ఈ రహదారి వెంట నిత్యం పాదచారులతోపాటు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఓ ప్రమాదం సైతం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీకి సంబంధించిన కల్వర్టు పైన సిసి వేయడంతోపాటు వేసిన సిసి పగిలిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాటాడుతున్న ఐదుగురిపై కేసు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం గిడ్డంగి సమీపంలో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావనంపై దాడి చేసినట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9400 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని, ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కోళ్ల ఆటో, బైక్ ఢీ.. ఒకరి మృతి

నవతెలంగాణ-పోతంగల్

కోటగిరి మండలంలోని నాగేంద్రపూర్ గ్రామానికి చెందిన గైని మైసయ్య, తన కుమారుడు పవన్ (22)తో కలిసి ఆదివారం ఉదయం పొలంలో మందు పిచికారీ చేసేందుకు తమ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న కోళ్ల ఆటో.. బైక్‌ను ఢీ కొనడంతో పవన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

మత్తడి పోచమ్మ ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న బుడగ జంగాల సంఘం సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి బుడగ జంగాల సంఘం సభ్యులు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం విరాళాలు అందజేశారు. బుడగ జంగాల సంఘం సభ్యులు 10016 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుర్ర నారాగౌడ్, రాజారాం, బాలయ్య, మందకృష్ణ, రాజు, నగేష్, శివలాల్, బుడగ జంగాల కమిటీ సభ్యులు తదితరులున్నారు.

విరబూసిన మామిడి పూత


పూతతో ఆహ్లాదకరంగా మారిన మామిడిచెట్టు

నవతెలంగాణ-లింగంపేట్

పంట పొలాల్లో మామిడి చెట్టు విరబూసింది. మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ప్రధాన రహదారి పక్కన మామిడి చెట్టు విరబూయడంతో వాహనదారులకు ఆకర్షిస్తోంది.

గోదా రంగనాథ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట్ మండలంలోని ఖుదావంద్ పూర్ (కోదండపురం) గ్రామంలో శ్రీ గోదారంఘనాథ కళ్యాణ మహోత్సవానికి రావాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డినీ ఆలయ కమిటీ, సభ్యులు ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 2025 సంవత్సర క్యాలెండర్‌ను నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, జిల్లా అధ్యక్షులు వెనిగల్ల సురేష్, ప్రధాన కార్యదర్శి పుదారి అరవింద్, ఉపాధ్యక్షులు మల్లేశం, భారతి, ఇబ్రహీం, కార్యదర్శి గంగ ప్రసాద్, లింబయ్య సీనియర్ నాయకులు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, ఎవన్, గోపిలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ విద్యారంగ సమస్యలపై చర్చించగా డీఈవో సానుకూలంగా స్పందించారని తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఇబ్బందులను వారికి తెలిపారు. కారుణ్య నియామకం గురించి కూడా తెలిపామన్నారు. ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆర్మూర్

భారత ప్రధాని నరేంద్ర మోడీ రైతుల ప్రయోజనార్థం నూతన సంవత్సర కానుకలు ప్రకటించడాన్ని హర్షిస్తూ ఆదివారం మండలంలోని పిప్రి గ్రామంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, మండల అధ్యక్షులు రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి "ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి" కింద అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సహాయాన్ని రూ.6000నుంచి 10వేలకు పెంచడం జరిగిందన్నారు. ఈ డబ్బు నేరుగా రైతులకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముత్తెన్న కేసి, భూషణ్, పండరి, రవి, దేవరెడ్డి, ప్రీతం, కృష్ణ, భోజన్న, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు పీర్ సింగ్ నాయక్, దాసరి గోపి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నవతెలంగాణ-కామారెడ్డి


హమాలీలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలింపు

కార్మికులను అరెస్టు చేయడం సరికాదని ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తేకుండా ఉన్న కార్మికులకు కూలిరేట్లను పెంచి ప్రభుత్వం తన ఉదారతను చాటుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ సిపిఐ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది వివిఎల్ నరసింహారెడ్డి అన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఆదివారం జిల్లాలోని కామారెడ్డి, సదాశివనగర్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, పిట్లం, బిచ్కుందలలో పెరిగిన రేట్లను ఇవ్వాలని పోరాటం చేస్తుంటే ఇతర రాష్ట్రాల కార్మికులను తీసు కువచ్చి పనులు చేపిస్తుంటే న్యాయం అడగడానికి వెళ్లిన కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం సిగ్గుచేటని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజ్, సివిల్ సప్లై హమాలీ గౌరవాధ్యక్షులు ఎల్.దశరథ్, సివిల్ సప్లై హమాలీ నాయకులు బీరయ్య, బాజీ, కృష్ణ, సంపత్, శ్రీనివాస్, భీమయ్య, గంగరాజు, మహేష్, ప్రవీణ్, ఎల్లేశం, సాయిలు, రాజశేఖర్, ప్రసాదు, బాలమల్లు, పద్మను అరెస్టు చేసి భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఎడపల్లి


ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎడపల్లి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల సంఘం కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడుగా నార్ల గోవర్ధన్ గుప్త (మంగల్‌పహాడ్), ప్రధాన కార్యదర్శిగా లింగ బాలేష్ గుప్త (జాన్కంపేట్), ఉపాధ్యక్షులుగా సుధీర్ గుప్త (కుర్నపల్లి), కోశాధికారిగా బి.వేణు గుప్త (ఎడపల్లి), సహాయ కార్యదర్శిగా రాపల్లి సురేష్ గుప్త (నెహ్రూనగర్), జిల్లా కార్యవర్గ సభ్యులుగా మార లింగేష్ గుప్త, నాగరాజు గుప్త, కాశీనాథ్ గుప్త, సంతోష్ గుప్త ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వర్ గుప్త, జ్ఞానేశ్వర్ గుప్త, కిషోర్ గుప్తను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోవర్ధన్ గుప్త మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి సమిష్టితో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బచ్చు అంజయ్య గుప్త, జిల్లా కోశాధికారి నీల భాస్కర్ గుప్త, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, నార్ల శ్రీనివాస్ గుప్త, శంకర్ గుప్త, లక్ష్మణ్ గుప్త, పురుషోత్తం గుప్త, శివకుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఠానాకాలన్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985-86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు.. ఆనాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు జీవితంలో వారు సాధించిన విజయాలను ఇష్టాగోష్టి చర్చలో మనస్ఫూర్తిగా మాట్లాడుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో కొందరు వ్యాపార వేత్తలుగా, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, ఇంకొందరు వ్యవసాయదారులుగా ఇలా.. వివిధ పనులు చేస్తున్నట్టు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బోర్గం (పి) కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఎల్‌ఓసిలను, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఈగ రమేష్ రెడ్డి, పసుల శ్రీను, సుభాష్, చిట్టి కిష్టయ్య, యూత్ జనరల్ సెక్రెటరీ ఆకాష్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఒక సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానం

- సీసీ కెమెరాలపై అవగాహన



నవతెలంగాణ-మోపాల్

ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఎస్ఐ యాదగిరి గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మంచిప్ప గ్రామ ప్రజలకు సీసీ కెమెరాలపై ఎస్సై యాదగిరిగౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కచ్చితంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను గ్రామంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో దొంగతనాలు, చట్ట వ్యతిరేక చర్యలు పాల్పడకుండా సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ విడిసి కమిటీ నాయకులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యేకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు

- తెలిపిన మాజీ వైస్ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపత్ రెడ్డిని మండల మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, కొలి ప్యాక్ మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్ కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మండల్ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్, నాయకులు మద్దుల శ్రీనివాస్, అభిలాష్ పాల్గొన్నారు.